క్లుప్తంగా

బి.కొత్తకోట కమిషనర్‌గా పల్లవి



బి.కొత్తకోట : బి.కొత్త కోట నగర పంచాయతీ కమిషనర్‌గా జీవీ.పల్లవిని నియమిస్తూ శనివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ పనిచేస్తున్న కమిషనర్ పీఆర్.మనోహర్ మదనపల్లె సెలక్షన్ గ్రేడ్ మున్సిపాలిటీకి మేనేజర్‌గా బదిలీ అయ్యారు. దీనితో సత్యసాయి జిల్లా కదిరి మున్సిపాలిటీలో మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న పల్లవికి పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కమిషనర్‌గా ఇక్కడ నియమించారు. కాగా వచ్చే మంగళవారం తర్వాత విధుల్లో చేరనున్నట్టు పల్లవి చెప్పారు.

కుక్కల దాడిలో జింకకు గాయాలు

పెద్దతిప్పసముద్రం : స్థానిక రంగ సముద్రం రోడ్డులో అటవీ ప్రాంతం నుంచి వచ్చిన ఓ జింకపై శునకాలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. అటుగా వెళుతున్న ప్రజలు కుక్కల బారి నుంచి జింకను కాపాడి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం అటవీ శాఖ అధికారులకు ఫోన్ ద్వారా సమాచారం చేరవేశారు.

కిందపడి వ్యక్తికి గాయాలు

పెద్దతిప్పసముద్రం : మండలంలోని కమ్మచెరువు పంచాయతీ నిమ్మకాయలపల్లి సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. బి.కొత్తకోట మండలం గట్టు గ్రామానికి చెందిన సుధాకర్ వృత్తిరీత్యా కార్పెంటర్ పని చేస్తున్నారు. చెక్క కొయ్యలు కొనుగోలు చేసేందుకు ద్విచక్ర వాహనంలో వెళ్తూ.. ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే ప్రయత్నంలో కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో మదనపల్లి జిల్లా ఆసుపత్రికి తరలించారు.

వేతనాలు చెల్లించాలి

మదనపల్లె సిటీ : మున్సిపాలిటీలో పనిచేసే కంటింజెంట్ పార్ట్ టైం వర్కర్లుగా పని చేస్తున్న స్కూల్ స్వీపర్లకు వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ డిమాండ్ చేశారు. మున్సిపల్ పాఠశాలల్లో కంటింజెంట్ పార్ట్ టైం స్వీపర్లుగా పని చేస్తున్న వారికి కేవలం రూ.4వేలు ఇస్తూ స్కూలులో గొడ్డు చాకిరీ చేయించు కుంటున్నారని ఆరోపించారు. వారికి ఈపీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

ప్రపంచ అల్జీమర్స్ డే

వాల్మీకిపురం : ప్రపంచ అల్జీమర్స్ డే సందర్భంగా మండలంలోని మూరేవాండ్లపల్లిలో ప్రజలకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ మాట్లాడుతూ ఈ మతిమరుపు వ్యాధి డెమెషియా అనే మానసిక వ్యాధిలో భాగమన్నారు.మంచి పౌష్టికాహారం, ఆకుకూరలు, కూరగాయలు, పాలు, గుడ్లు, నీరు, సరైన నిద్ర, సెల్ ఫోన్ వాడకం తగ్గించడంతో మతిమరుపునకు గురికాకుండా ఉండవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో పుష్ప, రెడ్డెమ్మ పాల్గొన్నారు.

పిల్లల సంరక్షణ బాధ్యత తల్లిదండ్రులదే..



మాట్లాడుతున్న సీడీపీవో భారతి

వాల్మీకిపురం : బిడ్డకు రెండు సంవత్సరాలు వచ్చే వరకూ వారిని సంరక్షించే బాధ్యత తల్లిదండ్రులదేనని సీడీపీవో భారతి అన్నారు. రాష్ట్రీయ పోషణ్ మా– 2024 కార్యక్రమంలో భాగంగా వాల్మీకిపురంలోని మూడో అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. సీడీపీవో భారతి మాట్లాడుతూ చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తే ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ రోహిణి, అంగన్‌వాడీలు నజీమున్నీసా, భూశైలేశ్వరి, సంపూర్ణ, గులాబ్ జాన్, శ్రావణి, శ్రీలత, చంద్రావతి, రేష్మా, తదితరులు పాల్గొన్నారు.

శాంతి స్థాపనకు కృషి చేయాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ కృష్ణవేణి

మదనపల్లె సిటీ : ప్రశాంతత, శాంతి ద్వారానే సమాజంలోని అరాచకాలు రూపుమాపడం సాధ్యమవుతుందని ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ కృష్ణవేణి అన్నారు. స్థానిక డిగ్రీ కాలేజీలో శనివారం అంతర్జాతీయ శాంతి దినోత్సవం నిర్వహించారు. కృష్ణవేణి మాట్లాడుతూ అంతర్జాతీయ శాంతి పెంపొందించాల్సిన ఆవశ్యకతను వివరించారు. అనంతరం కళాశాల ఆవరణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో గ్రామ జ్యోతి సొసైటీ అధ్యక్షురాలు సుభద్రమ్మ, అధ్యాపకులు వనజ, జ్యోతి, శ్రీనివాసులు, ఖాజావల్లి, సూర్యశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు కలికిరికి మాజీ సీఎం రాక

కలికిరి : ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి సోమవారం కలికిరికి రానున్నట్లు ఆయన వ్యక్తిగత కార్యదర్శి క్రిష్ణప్ప తెలిపారు. 23న రేణిగుంట విమానాశ్రయం నుంచి రోడ్డు మార్గంలో కలికిరికి విచ్చేసి, ఈ నెల 28 వరకు అందుబాటులో ఉంటారని ఆయన తెలిపారు.

వంద రోజులైనా.. నిరాశే

- హామీలను పట్టించుకోని మంత్రి లోకేశ్
- తంబళ్లపల్లెకు పరిశ్రమలు ఎప్పుడు రప్పిస్తారు!
- మదనపల్లె మార్కెట్ దత్తత మాట గుర్తుందా?
- ఇచ్చిన హామీలు మరచి పోయిన లోకేష్
- వైఎస్సార్‌సీపీ శ్రేణులపై అక్రమ కేసులు
- వంద రోజుల పాలనలో ఒక్క హామీకి దిక్కులేదు
- 2015లో చంద్రబాబు ఇచ్చిన హామీకి మోక్షం లేదు



'తంబళ్లపల్లె నియోజకవర్గంలో ఉపాధిలేక వలసలు పోతున్నారు.. నిరుద్యోగ సమస్య ఉంది.. టమాటా రైతులకు ఎన్నో సమస్యలు ఉన్నాయి.. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ సమస్యలన్నీ పరిష్కరిస్తా.. తంబళ్లపల్లెకు పరిశ్రమలు తెస్తా, మదనపల్లె మార్కెట్ యార్డును దత్తత తీసుకుంటా.'

యువగళం పాదయాత్రలో నారా లోకేష్ తంబళ్లపల్లె ప్రజలకు ఇచ్చిన హామీ ఇది.

బి.కొత్తకోట : టీడీపీ ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు గడచినా ఆ పార్టీ నేత లోకేశ్ ఇచ్చిన హామీలకు అతీగతీ లేకుండా పోయింది. తంబళ్లపల్లె గురించి అసలు పట్టించుకోకపోవడంతో నియోజకవర్గ ప్రజల్లో అసంతృప్తి రగులుతోంది. 2023 మార్చిలో ఐదురోజుల పాటు పాదయాత్ర చేసి నిర్వహించిన సభలు, సమావేశాల్లో ఇబ్బడిముబ్బడిగా హామీలు గుప్పించిన ఆయన ఒక్కటీ నెరవేర్చిన పాపాన పోలేదు. ఇప్పుడేమో వంద రోజుల పాలనలో 'ఇది మంచి ప్రభుత్వం' అంటూ ఇంటింటా స్టిక్కర్లు అంటించడంతో జనం ముక్కున వేలేసుకుంటున్నారు.

తంబళ్లపల్లెకు పరిశ్రమలు తెస్తా

కురబలకోట, బి.కొత్తకోట, పెద్దతిప్పసముద్రం, ములకలచెరువు మండలాల్లో జరిగిన పాదయాత్రలో ఇప్పటి మంత్రి లోకేష్ తంబళ్లపల్లె నియోజకవర్గానికి పరిశ్రమలు తీసుకొస్తానని మాటిచ్చారు. ఇక్కడి నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తానని, వలసలు నిరోధిస్తానని పలు మార్లు ప్రకటించారు. దీనిపై కరవు ప్రాంత నిరుద్యోగులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

మదనపల్లె మార్కెట్ దత్తత ఒట్టిదేనా?

దేశంలోనే అతిపెద్ద టమాటా మార్కెట్ మదనపల్లె. ఇక్కడి నుంచి టమాటాను దేశవ్యాప్తంగా పలు ప్రాంతాలకు ఎగుమతి చేస్తారు. ఇక్కడ నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానని లోకేశ్ బి.కొత్తకోట మండలం బుచ్చిరెడ్డిగారిపల్లె రైతు సదస్సులో హామీ ఇచ్చారు. మార్కెట్‌ను దత్తత తీసుకొని అభివృద్ధి చేస్తానని ప్రకటించారు. ఈ హామీ అమలు కోసం రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. లోకేష్ దీనిపై స్పందించలేదు.

అభ్యర్థి హామీలన్నీ మాటలే

నియోజకవర్గ అభివృద్ధికి పరిశ్రమలు తెస్తానని, పరిశ్రమల కారిడార్ ఏర్పాటు చేస్తానని, టమాట ఆధారిత పరిశ్రమలు నెలకొల్పుతామని ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి జయచంద్రారెడ్డి హామీ ఇచ్చారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు, సమస్యల పరిష్కారం అంటూ హామీలు ఇచ్చి చేతులు దులుపుకొన్నారు. హామీలు నెరవేర్చాలని ప్రజలు కోరుతున్నారు.

ఇసుకకు కప్పం కట్టాలా

తంబళ్లపల్లె నియోజకవర్గంలో నిర్మాణాలకు ఇసుక తరలించుకోకుండా నెలరోజులుగా ఓ టీడీపీ నాయకుడి హుకూంతో ఆగిపోయింది. వందల సంఖ్యలో జరుగుతున్న ప్రైవేటు, వేల సంఖ్యలో గత ప్రభుత్వం మంజూరు చేసిన పక్కా ఇళ్ల నిర్మాణాలు పూర్తిగా నిలిచిపోయాయి. ఓ నాయకుడికి ప్రతినెలా చెప్పిన మేరకు కప్పం కడితేనే అనుమతిస్తామని హుకూం జారీ చేయడంతో టీడీపీ కార్యకర్తలు, ఇతరులు ఇసుక తరలింపు నిలిపివేశారు. దీనితో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

చిరుద్యోగులపై వేధింపులు

ఓ టీడీపీ నేత ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న క్షేత్ర సహాయకులు, వెలుగులో పనిచేస్తున్న సంఘ మిత్రలను తొలగించాలని సిఫార్సు లేఖలు ఇస్తూ చిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్నారు. తొలగించకూడదంటే మేం చెప్పింది వినాలని టీడీపీ నేత అనుచరులు ఒత్తిడి చేస్తున్నారు. గతంలో వివిధ ఆరోపణలతో తొలగించిన వాళ్లను మళ్లీ విధుల్లోకి తీసుకోవాలంటూ చేస్తున్న ఒత్తిడి భరించలేక కొందరు అధికారులు నియోజకవర్గం నుంచి వెళ్లిపోయేందుకు ప్రయత్నాలు చేసుకుంటున్నారు.

వైఎస్సార్‌సీపీ శ్రేణులపై కేసులు

నియోజకవర్గంలో అధికార టీడీపీ నేతలు వైఎస్సార్‌సీపీ శ్రేణులను వేధించడమే పనిగా పెట్టుకున్నారు. బి.కొత్తకోటలో వినాయక చవితి సందర్భంగా నిమజ్జన ఊరేగింపులో జగన్ పాటలు వేసి రెచ్చగొట్టారని తొమ్మిది మంది, మరో 50 మంది ఇతరులు అని కేసు పెట్టించి వేధింపులకు గురిచేశారు. మండలాల్లో కూడా ఇలాంటి పరిస్థితి నెలకొంది. వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులను వేధించడం, పింఛన్లను రద్దు చేస్తామని, పథకం అడ్డుకుంటామన్న బెదిరింపులు కొన సాగుతున్నాయి.

బాబు హామీకి పదేళ్లు

'టమాట ఉద్యానవనపంట. దీనికి రుణమాఫీ చేస్తే ఇందులోని మిగతా పంటలకూ మాఫీ ఇవ్వాలి. అయి తే తంబళ్లపల్లె టమాట రైతుల పరిస్థితి భిన్నం. వీరిని ఆదుకునేందుకు రూ.10కోట్లతో ప్యాకేజీ ఇస్తున్నా' అని 2014 నవంబర్ 5న కురబలకోట మండలం అంగళ్లు సభలో నాటి, ప్రస్తుత సీఎం చంద్రబాబు తంబళ్లపల్లె టమాట రైతాంగానికి మాటిచ్చారు. ఆ నిధులు ఇంతవరకు మంజూరు చేయలేదు, టమాట రైతుకు పైసా ప్రయోజనం కలగలేదు. ప్యాకేజీ ప్రకటన మాటకే పరిమితమై మిగిలిపోయింది.

కోల్డ్ స్టోరేజీలు ఎక్కడ

తంబళ్లపల్లె నియోజకవర్గ రైతులను ఆదుకునేందుకు కోల్డ్ స్టోరేజీలు, టమాటా ఆధారిత పరిశ్రమలు, పల్ప్ పరిశ్రమలు ఏర్పాటు చేస్తానని టీడీపీ నేత లోకేశ్ హామీ ఇచ్చారు. టమాటా, దోస, దానిమ్మ, బొప్పాయి తదితర పండ్ల తోటల సాగు అధికంగా ఉన్నందున కోల్డ్ స్టోరేజీల ఏర్పాటు అత్యవసరం. ఇవి ఉంటే ఇక్కడ పండించే టమాటాను నిల్వ చేసుకుని గిట్టుబాటు ధరలు వచ్చాక విక్రయించుకునే వీలవుతుంది. పరిశ్రమలను ఏర్పాటు చేస్తే మంచి గిట్టుబాటు ధరలు వస్తాయి. లోకేష్ హామీల అమలు కోసం అన్నదాతలు వేచిచూస్తున్నారు.

ఏకపక్ష ధోరణి వద్దు

ఎంపీడీవోకు ఎంపీపీ, ఎంపీటీసీల వినతి



ఈవోఆర్డీకి వినతి పత్రం అందజేస్తున్న ఎంపీపీ, తదితరులు

పెద్దతిప్పసముద్రం : ఎంపీపీ అనుమతి ద్వారా సమావేశం జరగాల్సి ఉన్నా.. చర్చించకుండా తేదీని ఖరారు చేయడంపై ఆంతర్యం ఏమిటి.. ఎంపీడీవో ఏకపక్ష ధోరణి విడనాడాలని ఎంపీపీ మహమూద్, ఎంపీటీసీ సభ్యులు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం జరగాల్సిన మండల్ మీట్ తాత్కాలికంగా వాయిదా పడింది. అధికారులు వచ్చినా.. ఎంపీపీతో సహా సభ్యులెవరూ హాజరు కానందున మండల్ మీట్ వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీఓ కేఎస్.బాలాజీ ప్రకటించారు. అంతకు మునుపే కూటమి నాయకులు మండల పరిషత్ కార్యాలయానికి తరలిరావడంతో ముందస్తుగా పోలీసులను మోహరించారు. సభ్యులందరూ రాజీనామా చేసి ప్రజలచే ఎన్నుకోబడి సమావేశం జరపాలని కూటమి నాయకులు డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, ఎంపీడీవో వైఖరిపై ఎంపీపీ మహమూద్ మాట్లాడుతూ అధికారుల నిర్లక్ష్యం కారణంగా గతంలో రెండు సార్లు సమావేశం వాయిదా పడిందన్నారు. గతంలోనూ తనతో పాటు 3 మంది సభ్యులు హాజరైనా కూటమి నాయకులు గుంపుగా వచ్చి అధికారులను లోనికి వెళ్లనీయకుండా అడ్డుకుంటున్నారని అప్పటి ఎంపీడీవో బ్రహ్మానందరెడ్డి పేర్కొన్నారని తెలిపారు. తాము రక్షణ కల్పిస్తామని పోలీసులు భరోసా ఇచ్చినా అప్పటి ఎంపీడీవో శాంతి భద్రతల దష్ట్యా మండల్ మీట్ వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారన్నారు. చట్టంపై అవగాహన ఉన్న ఎంపీడీవో తాము రానందున మండల్ మీట్ వాయిదా వేస్తున్నామని ప్రకటించడం సమంజసమేనా అని ప్రశ్నించారు. అనుమతి లేకుండా ఇష్టారాజ్యంగా అధికారులే ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవడంతోనే మండల్ మీట్‌కు రాలేదని ఎంపీపీ స్పష్టం చేశారు. ఈవోఆర్డీ యోగానంద్‌కు వినతిపత్రం అందజేశారు.

బాధితులకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ



శ్రీరామిరెడ్డిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

వాల్మీకిపురం : మండలంలోని విఠలం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు శ్రీరామిరెడ్డి, ఎల్లారెడ్డిలను పీలేరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితులను ఆరా తీశారు. అలాగే వాల్మీకిపురం మండల సాక్షి విలేఖరి తల్లి శాంతమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి సాక్షి విలేకరి మనోహర్ ఇంటికి చేరుకొని కుటుంబ సభ్యులను పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే చింతల వెంట నీళ్లభాస్కర్, కేశవరెడ్డి, ఆనంద, అశోక్ కుమార్ రెడ్డి, రవి, రాయుడు, చికెన్ మస్తాన్, సైపుల్లా, నాగార్జున, రాజాబాబు, శ్రీనివాసులు, తదితరులు ఉన్నారు.

నిరుపేదలకు ఇంటి పట్టాలు ఇవ్వాలి



నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

తంబళ్లపల్లె : మండలంలోని నిరుపేద దళితులు, వ్యవసాయ కూలీలకు ప్రభుత్వం వెంటనే ఇంటి పట్టాలు ఇవ్వాలని సీపీఐ నాయకులు క్రిష్ణప్ప, అంజనప్ప డిమాండ్ చేశారు. కొట్లపల్లి రెవెన్యూ సర్వే నంబర్ 27 /2ఎ, బిలోని నాలుగు ఎకరాల భూమిలో ఇంటి పట్టాలు ఇవ్వాలని కోరుతూ ఎర్ర జెండాలు నాటారు. ఇంటి పట్టాలు ఇవ్వకపోతే ఆందోళనలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు నరసింహులు, సుధీర్‌కుమార్, మంత్రాల రమణ, వెంకటస్వామి, జయశేఖర్, మంగమ్మ, జయలక్ష్మి, దేవమ్మ, ఉత్తన్న, తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే లక్ష్యం



ప్రజావేదికలో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె : పేదల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. పట్టణంలోని మాలిక్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వంద రోజుల్లోనే సామాజిక పింఛన్లను రూ.3 వేల నుంచి 4వేల రూపాయలకు పెంచిందన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుతో ప్రజల ఆస్తుల భద్రతకు భరోసా కల్పించిందన్నారు. అనంతరం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కే.ప్రమీల, తహసీల్దారు ఖాజాబీ, ఎంపీడీఓ భానుప్రసాద్, సీఐ చాంద్‌బాషా, నాయకులు రాటకొండ గురప్ప నాయుడు, నవీన్‌చౌదరి, మైనారిటీ నాయకులు ఎస్.ఏ.మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యక్రమంలో తమ్ముళ్ల హడావిడి

ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమావేశమైనప్పటికీ తెలుగు తమ్ముళ్ల హడావిడే కనిపించింది. ప్రజలు సమర్పించిన ప్రతి అర్జీని అక్కడికక్కడే పరిష్కరించేసినట్లుగా హంగామా తప్ప, జరిగిందేమీ లేదు. ఎప్పటిలాగానే అర్జీలు తీసుకోవడం, సమస్య తెలుసుకోవడం, అర్జీదారులను పంపేయడం జరిగింది.

వేరుశనగ రైతులను ఆదుకోవాలి

ఎంపీపీ గుర్రం పూర్ణచంద్రిక



వేరుశనగ పంటను పరిశీలిస్తున్న ఎంపీపీ, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు

పెద్దమండ్యం : వేరుశనగ పంట సాగుచేసిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఎంపీపీ గుర్రం పూర్ణచంద్రిక కోరారు. మండలంలోని సి.గొల్లపల్లె పంచాయతీ మట్లివారిపల్లె వద్ద రైతులు సాగు చేసిన వేరుశనగ పంటను సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులతో కలిసి ఆమె పరిశీలించారు. తీవ్ర వర్షాభావంతో వేరుశనగ ఎండిపోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కో ఎకరం భూమిలో విత్తనాలు, ఎరువులు, కూలీల ఖర్చులు కలిపి రూ.20 వేలు వెచ్చించినట్లు రైతులు ఎంపీపీ దృష్టికి తెచ్చారు. రైతు సేవా కేంద్రాల ద్వారా ఈ క్రాప్, ఈకేవైసీ చేసిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలని ఎంపీపీ, సర్పంచులు, ఎంపీటీసీలు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ గుర్రం రమేష్, సర్పంచులు సోదనపల్లె బాషా, కంటి విశ్వనాథరెడ్డి, ఎంపీటీసీ మంచూరి జయరాం, వైఎస్సార్‌సీపీ నాయకులు గుర్రం రామచంద్ర, కోసూరి రాజు, షబ్బీర్ పాల్గొన్నారు.


ఘనంగా గురజాడ జయంతి



గురజాడకు నివాళులర్పిస్తున్న అధ్యాపకులు



బి.కొత్తకోటలో ఉపాధ్యాయుల నివాళి



వాల్మీకిపురంలో విద్యార్థుల నివాళి

మదనపల్లె సిటీ: అభ్యుదయ భావజాలంతో సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన మహనీయులలో గురజాడ అగ్రస్థానంలో ఉంటారని తెలుగు భాషా పరిరక్షణ సమితి అధ్యక్షుడు తాళంబేడు సాయిశంకర్ రెడ్డి అన్నారు. స్థానిక బాలికల జూనియర్ కాలేజీలో శనివారం గురజాడ జయంతి నిర్వహించారు. గురజాడ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సాయిశంకర్‌రెడ్డి మాట్లాడుతూ స్త్రీ జనోద్ధరణ, మూఢ విశ్వాసాల నిర్మూలనకు, తెలుగు వాడుక భాషగా చేసేందుకు గురజాడ చేసిన కృషి మరువలేనిదన్నారు. సాహిత్యం ద్వారా చైతన్యం తెచ్చేందుకు విశేష కృషి చేశారన్నారు. గురజాడ రచించిన దేశభక్తి, పూర్ణమ్మ, కన్యక, ఆణిముత్యాలు తదితర గేయాలను రాగయుక్తంగా ఆలపించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి రెడ్డప్పరెడ్డి గురజాడ సాహిత్యం కృషిని కీర్తించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బాలకృష్ణమూర్తి, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

బి.కొత్తకోట : మండల వనరుల కేంద్రంలో గురజాడ చిత్రపటానికి ఎంఈఓలు రెడ్డిశేఖర్, భీమేశ్వరాచారి పూలమాలవేసి నివాళి అర్పించారు. వారు మాట్లాడుతూ భరతమాత బిడ్డలు కలసిమెలిసి జీవించాలని, దేశాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని గురజాడ అప్పారావు సూచించారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగరాజు, సీఆర్పీ శ్రీనివాసులు, ఎమ్మార్సీ సిబ్బంది నరసింహులు, ఆది, ఉబేదుల్లా, రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

వాల్మీకిపురం : అభ్యుదయ తెలుగు కవితా పితామహుడు గురజాడ అప్పారావు అని జెవీవీ జిల్లా అధ్యక్షుడు ప్రభుచరణ్ అన్నారు. గురజాడ జయంతి సందర్భంగా స్థానిక పీవీసీ ప్రభుత్వోన్నత పాఠశాలలో గురజాడ అప్పారావు చిత్రపటానికి జేవీవీ నాయకులు శనివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రభుచరణ్ మాట్లాడుతూ అంటరానితనం, కన్యాశుల్కం, బాల్య వివాహం వంటి సాంఘిక దురాచారాలపై తన రచనల ద్వారా పోరాటం చేసిన గొప్ప సాహితీకారుడు గురజాడ అన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం సావిత్రి, ఉపాధ్యాయులు నాగేశ్వరరావు, తారాదేవి, శంకర, నాగరాజ, పురుషోత్తం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై స్పందించాలి

తంబళ్లపల్లె : మండలంలోని ప్రజా సమస్యలపై అధికారులు వెంటనే స్పందించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి కోరారు. శనివారం కొట్టాలలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ప్రజల నుంచి వినతులు సేకరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సురేంద్రనాథ్, ఈఓపీఆర్డీ దిలీప్‌కుమార్, ఎంఈఓ త్యాగరాజు, నాయకులు రెడ్డప్పరెడ్డి, సిద్దమ్మ, ధనశేఖర్, క్రిష్ణమూర్తినాయుడు, తులసీధర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యం

పీలేరు : సంక్షేమ పథకాలు అంచెలంచెలుగా ప్రజలకు అందించడమే లక్ష్యమని పీలేరు ఎమ్మెల్యే కిశోర్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పీలేరు పంచాయతీ కార్యాలయం ఆవరణంలో శనివారం కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పింఛన్లు పెంచి ఇచ్చినట్లు తెలిపారు. విజయవాడను వరద ముంచెత్తిన సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సకాలంలో స్పందించి ప్రజలను ఆదుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

23న మెగా జాబ్‌మేళా

మదనపల్లి : పట్టణంలోని జ్ఞానాంబిక డిగ్రీ కాలేజీలో ఈ నెల 23వ తేదీన మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే షాజహాన్ బాషా తెలిపారు. నియోజకవర్గంలోని నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు జై గ్లోబల్ టెక్, వీబాస్ టెక్నాలజీ ఆధ్వర్యంలో 23న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు మెగా జాబ్‌మేళా జరుగుతుందన్నారు. నియోజకవర్గంలో ఇంటర్ లేదా ఏదేనీ డిగ్రీ పూర్తి చేసి, ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువత అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

మదనపల్లె సిటీ : స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం చెన్నైకి చెందిన శంకర నేత్రాలయ ఆధ్వర్యంలో ఉచిత కంటి చికిత్స శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు చిన్ని తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వైద్యులు పరీక్షలు చేస్తారన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉల్లాసంగా క్రీడల పోటీలు



యోగా చేస్తున్న విద్యార్థులు

మదనపల్లె సిటీ : స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం నియోజకవర్గ స్కూల్ గేమ్స్ ఉల్లాసంగా జరిగాయి. అండర్–14, 17 బాల, బాలికలకు బ్యాడ్మింటన్, యోగా, చెస్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన వారిని జిల్లా స్థాయికి ఎంపిక చేసినట్లు కో ఆర్డినేటర్ భద్రయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో పీడీలు రాంబాబు, నాగరాజు, శివ, శంకర్, దిలీప్, నాగరాజ్ దేవకి, జలజ, పార్థసారథి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్స్ ఎంపిక

కురబలకోట : అంగళ్లులోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం ఎన్‌సీసీ క్యాడెట్స్ ఎంపిక జరిగింది. చిత్తూరు 35 ఆంధ్ర బెటాలియన్ సుబేదార్ మేజర్ రాకేష్ లాల్, పర్మినెంట్ ఇన్‌స్ట్రక్టర్ సతీష్ ఆధ్వర్యంలో దేహ దారుఢ్య పరీక్షలు, పరుగు పందెం నిర్వహించారు. వంద మంది పాల్గొనగా 47 మంది ఎంపికై నట్లు ప్రిన్సిపల్ యువరాజ్ తెలిపారు. అదే రోజున కళాశాలలో మద్రాస్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ఎన్‌పీటీఈఎల్ సంయుక్త నిర్వహణలో స్వయం సర్టిఫికేషన్ కోర్సు ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించారు. ఉత్తీర్ణులైన వారికి ఆన్‌లైన్ సర్టిఫికెట్లు అందజేస్తారని ప్రిన్సిపల్ తెలిపారు.

కెఎంపీఎల్ పెంచాలి

మదనపల్లె సిటీ : డ్రైవర్లు కెఎంపీఎల్ పెంచాలని ఆర్టీసీ–1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి అన్నారు. స్థానిక డిపో కార్యాలయంలో డ్రైవర్లకు శనివారం శిక్షణ కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు వాహనాలు నడిపేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకుని, డిపోకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో సీఐ గీత, సిబ్బంది పాల్గొన్నారు.

గెవితిమ్మరాయస్వామికి ప్రత్యేక పూజలు

రామసముద్రం : మండలంలోని దిన్నిపల్లి సమీపంలో కొండపై వెలసిన గెవితిమ్మరాయస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు జరిపారు. ప్రధాన అర్చకులు కులశేఖర్‌బట్టర్ స్వామిని పలు రకాల పుష్పాలతో అలంకరించి అర్చన, అభిషేకాలు చేశారు. భక్తులకు దర్శన భాగ్యం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీ చైర్మన్ రఘుపతిరెడ్డి ఆగిస్తప్ప పాల్గొన్నారు. చెంబకూరు రోడ్డులోని శనేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి అభిషేకాలు అర్చనలు నిర్వహించి, తీర్థప్రసాదాలు అందజేశారు.

విద్యార్థులకు అవగాహన

మదనపల్లె సిటీ : మదనపల్లె పట్టణం అమ్మచెరువు మిట్ట సమీపంలోని వెలుగు ప్రత్యేక పాఠశాలలో శనివారం అల్జీమర్స్ డే నిర్వహించారు. డాక్టర్లు చంద్రశేఖర్, ఉష అల్జీమర్స్ వ్యాధి లక్షణాలు, చికిత్స గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. మతిమరుపు వ్యాధిగా కాకుండా శరీరంలో జరిగే చిన్న మార్పు అని తెలుసుకుని చికిత్స తీసుకోవాలన్నారు. చక్కటి సంగీతం, ఉల్లాస వాతావరణంలో తమ విలువైన సమయాన్ని గడపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉదయమోహనరెడ్డి, కన్వీనర్ భాగ్యలక్ష్మి, ప్రిన్సిపల్ లీనా కుమారి, గీత తదితరులు పాల్గొన్నారు.